# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ సమానంగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు.**

**2.** **రైతు భరోసా పథకం కింద ఆరు రోజుల్లోనే 66 లక్షల 19 వేల మంది రైతుల ఖాతాల్లో 7 వేల 770 కోట్ల రూపాయలు జమ చేశామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**

**3.** **అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహించిన రెండు కార్యక్రమాలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది.**

**4.** **రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.**

**5.** **రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు త్వరలో పాలకవర్గాలను నియమించనున్నామని ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు.**

==========================

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ సమానంగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. విశాఖపట్నంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి వరకు తొమ్మిది జిల్లాలకు విజన్ డాక్యుమెంట్ తయారుచేశామని తెలిపారు. తిరుపతి కేంద్రంగా రాయలసీమ, అమరావతి కేంద్రంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకూ 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నామని.. ఐదు లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరిస్తూ...

..వాయిస్ 34 సెకన్లు

---------------------------

కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం ఈ నెల 27వ తేదీన జరగనుంది. వర్చువల్‌గా జరిగే ఈ సమావేశానికి హాజరు కావాలంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు బోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయిపురే నిన్న సమాచారం అందించారు. రాష్ట్రాల నుంచి బోర్డులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు రాష్ట్రాలు 25 శాతం ఇన్సెంటివ్‌లు ఇవ్వడాన్ని కేంద్ర ప్రభుత్వం గతంలో నిలిపివేసింది. దీంతోపాటు అప్పటి వరకు చెల్లించిన మొత్తం

రికవరీకి ఆదేశించింది. దీనిపై ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రికవరీ నిర్ణయాన్ని మాత్రం నిలువరిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఈ నిర్ణయంపై చర్చించి బోర్డు ఆమోదం తెలియజేయాల్సి ఉందని సమాచారం.

-----------------------------

తెలంగాణలో రైతు భరోసా పథకం కింద 9 ఎకరాల వరకు నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం నాటికి ఏడెకరాల వరకు నిధులను విడుదల చేసిన ప్రభుత్వం నిన్న 8, 9 ఎకరాలు ఉన్న రైతులకు రైతు భరోసా సాయం జమ చేసింది. ఎనిమిది ఎకరాలు ఉన్న 67 వేల 352 మంది రైతులకు సంబంధించిన 4 లక్షల 42 వేల ఎకరాలకు 265 కోట్ల 91 లక్షల రూపాయలను విడుదల చేసింది. అలాగే 9 ఎకరాలున్న 39 వేల 164 మంది రైతులకు చెందిన 3 లక్షల 23 వేల 875 ఎకరాలకు 194 కోట్ల రూపాయలకు పైగా నిధులు జమ అయ్యాయి. ఈ ఆరు రోజుల్లోనే 66 లక్షల 19 వేల మంది రైతుల ఖాతాల్లో 7 వేల 770 కోట్ల 83 లక్షల రూపాయలను జమ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

-----------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహించిన రెండు కార్యక్రమాలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ 30.16 కిలోమీటర్ల మేర 3 లక్షల 3 వేల 654 మందితో చేపట్టిన యోగా ప్రదర్శన గిన్నిస్ రికార్డు సొంతం చేసుకుంది. అలాగే, శుక్రవారం సాయంత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 22 వేల 122 మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల్లో 108 సార్లు సూర్య నమస్కారాలు చేశారు. ఈ కార్యక్రమానికి కూడా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ రెండు రికార్డులకు సంబంధించిన పత్రాలను మంత్రి నారా లోకేశ్‌కు గిన్నిస్ బుక్ ప్రతినిధులు అందజేశారు.

-----------------------------

యోగాంధ్ర కార్యక్రమానికి 2 గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులు రావడంపై ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని యోగాంధ్రను విజయవంతం చేశారని ఆయన తెలిపారు. ఇది ఆంధ్రుల విజయమన్న మంత్రి లోకేశ్.. ఈ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ...

.. వాయిస్ 22 సెకన్లు

-----------------------------

సంకల్పబలం, ప్రణాళికా సామర్థ్యం, పర్యవేక్షణా పటిమ ఉంటే ఏదైనా సాధించవచ్చన్న విషయం విశాఖపట్నంలో జరిగిన యోగాంధ్ర ద్వారా నిరూపితం అయిందని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. యోగాంధ్ర ఘన విజయం సాధించడంపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. పాలకులు సదుద్దేశంతో తీసుకునే నిర్ణయాలకు ప్రజలు మద్దతిస్తారని నెల రోజుల పాటు సాగిన యోగాంధ్ర నిర్ధారించిందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ విశిష్టత దేశ విదేశాలకు తెలిసిందని మంత్రి పేర్కొన్నారు. యోగా దినోత్సవం ఘన విజయానికి కారణమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సత్యకుమార్ అభినందనలు తెలిపారు.

-----------------------------

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన సందర్భంగా నిన్న ఆయన రెవెన్యూశాఖ ఉన్నతాధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని... స్వరాష్ట్రంలో ఏళ్ల తరబడి తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు త్వరలో పాలకవర్గాలను నియమించనున్నామని ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 5 కోట్ల రూపాయల మేర ఆదాయం దాటిన ప్రధాన ఆలయాల్లో నాణ్యతా ప్రమాణాలతో అన్న ప్రసాదాన్ని భక్తులకు అందించేలా చర్య తీసుకుంటామని తెలిపారు. నూతనంగా 481 ఆలయాలకు ధూప దీప నైవేద్యం కింద 10 వేల రూపాయలు మంజూరు చేశామని, అర్చకులకు గౌరవ వేతనాన్ని 10 వేల రూపాయల నుంచి 15 వేల రూపాయల వరకు పెంచామని మంత్రి వెల్లడించారు.

---------------------------

నల్ల బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ సాయంతో కొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. ప్రధానంగా బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో నల్ల బర్లీ పెద్దఎత్తున సాగవుతోంది. గత రెండేళ్లుగా ధర బాగుండటంతో రైతులు ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టారు. 100 మిలియన్ కిలోల మేర ఉత్పత్తి అయింది. 4 జిల్లాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి తొలి దశలో 20 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 21 వేల 874 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వేలో 48 గేట్ల నుంచి, 6 స్లూయిజ్‌ల నుంచి నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 25.92 మీటర్లు, దిగువన 15.98 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాంకి ఎగువన 25.91 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకి దిగువన 14.08 మీటర్ల మేర నీటిమట్టం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

---------------------------

ప్రపంచ వ్యాప్తంగా వర్షారణ్యాల సంరక్షణ దినోత్సవం ఈరోజు జరుపుకుంటున్నారు. ప్రప్రథమంగా 2017 జూన్ 22వ తేదీన ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. భూమిపై జీవులకు వర్షం ప్రధాన జీవనాధరం. వర్షాలు మనకు త్రాగునీరు అందించడంతోపాటు వాతావరణ పరిస్థితులను సమతుల్యంలో ఉంచడానికి దోహదపడతాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...30 సెకన్లు

=====================